క్లుప్తంగా

ఎమ్మెల్సీ కోదండరాంను నాయకులు



ఎమ్మెల్సీ కోదండరాంతో నాయకులు

బూర్గంపాడు: ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకులు కలిశారు. భద్రాచలం పర్యటనలో భాగంగా శుక్రవారం సారపాకలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డి ఇంటికి రాగా నాయకులు కలిసి స్థానిక సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారమందిస్తానన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, రామారావు, యారం పిచ్చిరెడ్డి, మహమ్మద్ ఖాన్, వెంకటనారాయణ, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న భానుప్రసాద్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన పరివర్తన యశోద సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దుర్గా స్వీట్స్ షాపు యజమాని బిర్రు సుధాకర్ అందజేసిన సరుకులను డాక్టర్ భానుప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు కొమ్మగిరి వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ సభ్యులు కోటా ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ములకలపల్లి : మండలకేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్ కో ఏఈ నరేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు తొలగింపు నిమిత్తం ములకలపల్లి, పొగళ్లపల్లి ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వడ్డెర రంగాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న ఐదేళ్లలోపు చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే వైద్యబృందం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు లోప పోషణ, తీవ్ర లోప పోషణ ఉన్న చిన్నారులకు పరీక్షలు చేసి, ఎన్ఆర్‌సీకి రిఫర్ చేశారు. అలాగే తల్లిదండ్రులకు పోషణలోపంపై అవగాహన కల్పించి, ఎన్ఆర్‌సీకు తరలిస్తున్న వారి ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌బీఎస్‌కే బృందం డాక్టర్ నందిత, డాక్టర్ అఖిల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.సౌజన్య, పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదు



మాట్లాడుతున్న నవీన్

మణుగూరు రూరల్ : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతికత బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అరుంధతినగర్ పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ప్రభుత్వంపై అవగాహన లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. పది నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా జీవిస్తున్నారన్నారు. గతంలో వారి పాలనలో సొంత మండలంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన పట్టించుకోని నాయకులు.. ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు శివసైదులు, నాయకులు కూచిపూడి బాబు, మాదాడి రాజేష్, రహీం పాషా, చింతల కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన 'ప్రత్యేక' పాలన

గ్రామాల వైపు చూడని ప్రత్యేకాధికారులు

- పల్లెల్లో పేరుకుపోయిన సమస్యలు
- పంచాయతీ కార్యదర్శులపై పనిభారం



వీధిదీపాలు వెలగక లక్ష్మీనగరంలో అలుముకున్న చీకట్లు

దుమ్ముగూడెం: పంచాయతీల్లో సర్పంచ్‌ల పాలన ముగిసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారుల పాలన తీసుకొచ్చింది. మండలంలో 37 పంచాయతీలుండగా వాటి పరిధిలో దాదాపు 100కు పైగా గ్రామాలకు గాను ప్రత్యేక అధికారులుగా నియమించింది. కొందరు అధికారులకు రెండుకు పైగా గ్రామ పంచాయతీలను అప్పగించారు. ఈ నేపథ్యంలో అధికారులు సొంత కార్యాలయాలకే పరిమితమై గ్రామాల్లో ప్రత్యేక పాలనపై దృష్టి సారించలేకపోతున్నారు.

కార్యదర్శులే ఆధారం..

ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులపై భారం పడింది. కొందరు జీపీ కార్యదర్శులు అదనంగా ఇన్‌చార్జ్‌లుగా ఉన్న పంచాయతీలకు ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదు. ప్రభుత్వం గ్రామాలకు సమయానుసారం నిధులు కేటాయించకపోవడం, గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో శానిటైజేషన్, ఫాగింగ్, వీధి దీపాల నిర్వహణ, ట్రాక్టర్ల నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడానికి అప్పులు చేయాల్సి వస్తోందని కొందరు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, కొన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లు సంతకాలు, స్టాంప్‌లు అక్రమంగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..



ఆర్లగూడెంలో పక్కన పెట్టిన చెత్త ట్రాక్టర్ (ఫైల్)

ప్రత్యేక పాలనలో తాగునీరు, వీధి దీపాలు, పరిశుభ్రత తదితర సమస్యలు గ్రామాల్లో పేరుకుపోయాయి. కొన్ని పంచాయతీల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు కూడా ప్రధాన రహదారిపైనే చేస్తున్నారని, గ్రామాల్లోని విధుల్లో చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో భగీరథ నీరు వారం రోజులుగా రాని పరిస్థితులు ఉన్నాయి. దీనిపై ఎవరూ పట్టించుకోవడం లేదు. వీధి దీపాలు సైతం వెలగడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరణ కోరేందుకు ఎంపీఓ రామకృష్ణను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఎన్నికలు నిర్వహించాలి



ప్రత్యేక అధికారుల పాలన మండలంలో అస్తవ్యస్తంగా ఉంది. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. గతంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు నిత్యం పర్యవేక్షించేవారు. అధికారులు పంచాయతీల వైపే రావడం లేదు. గ్రామాలకు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి స్థానిక సంస్థల ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలి.

– కారం పుల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి

ఎప్పుడొస్తున్నారో తెలియడం లేదు..



పంచాయతీలలో ప్రజాప్రతినిధుల పాలన ముగిసిన తర్వాత పంచాయతీలకు అధికారులు ఎప్పుడొస్తున్నారో ఎప్పుడెళ్తున్నారో తెలియడం లేదు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు జరగడం లేదు. చెత్త వేసే ట్రాక్టర్‌కు టైర్ పంక్చర్ అయితే వారం రోజులుగా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

– కొర్సా నరసింహారావు, ఆర్లగూడెం మాజీ ఉప సర్పంచ్

అయోడిన్ లోపాన్ని నివారిద్దాం..



దుమ్ముగూడెం: అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



చర్లలో...

దుమ్ముగూడెం : అయోడిన్ లోపాన్ని నివారించి ఆరోగ్యంగా జీవిద్దామని దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సావిత్రి, వైద్య సిబ్బంది ఈశ్వరమ్మ, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

చర్ల: అయోడిన్ లోపం వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సత్యనారాయణపురం వైద్యశాల ఎంఎల్‌హెచ్‌పీ పి.పార్వతి కోరారు. ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కుదునూరు జిల్లా, మండల పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్త్ విజిటర్ తిరుపతమ్మ, ఏఎన్ఎం సమ్మక్క, ఆశ కార్యకర్తల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జీఓ 33ను రద్దు చేయాలని వినతి

భద్రాచలంఅర్బన్: జీఓ 33ను రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ కార్యాలయం ఏవో రాంబాబులకు శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఈసాల సురేష్, చంద్రయ్య దొర తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

మణుగూరు రూరల్: సింగరేణి ఉద్యోగులు, కార్మికులు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పీకే ఓసీ ప్రాజెక్ట్ మేనేజర్ దండమూడి రాంబాబు అన్నారు. మండలంలోని సంతోష్‌నగర్ శ్రీ విద్యాభ్యాస (పూర్వ బాలవెలుగు) పాఠశాల విద్యార్థులకు ఓసీ–2 కార్మికుడు పెంద్యాల లక్ష్మయ్య–మంగ దంపతుల మనవడు కొప్పుల అశ్విక్ పుట్టిన రోజు సందర్భంగా సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రాజెక్ట్ మేనేజర్ ప్రారంభించగా నాసర్‌పాషా, కె.సురేష్, ఎం.లింగబాబు, కళ్యాణ్‌రామ్, బి.భాంగ్యా, అప్పారావు, నాగేంద్రకుమార్, ఓంకారి బాపు, పి.శేషగిరిరావు, సురేష్, వెంకటరమణయ్య, నెల్లూరి నాగేశ్వరరావు, వూకంటి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

మహా పాదయాత్రకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న నాయకులు

బూర్గంపాడు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో చేపట్టిన మాలల మహా పాదయాత్ర శుక్రవారం మండలంలో కొనసాగింది. సారపాక చేరుకున్న పాదయాత్రకు మండల మాల మహానాడు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సారపాకలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎస్సీ వర్గీకరణను మాలలు ఐక్యంగా అడ్డుకోవాలని మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. మాల మహానాడు మండల అధ్యక్షుడు తుమ్మల కిరణ్, లాలయ్య, కొట్టె అనిల్, గుర్రాల సుదర్శన్, కొనకంచి శ్రీనివాస్, గొనె రేణుక, శేషమ్మ, పప్పుల జయ, కనపర్తి సునీత ఉన్నారు.

గవర్నర్‌ను కలిసిన వెదురు క్లస్టర్ డైరెక్టర్లు



చంద్రుగొండ : వెదురుతో తయారుచేసిన పుష్పగుచ్ఛం గవర్నర్‌కు ఇస్తున్న డైరెక్టర్లు

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామంలోని వెదురు ఉత్పత్తుల క్లస్టర్ చైర్మెన్‌తోపాటు డైరెక్టర్లు శుక్రవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిశారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రత్యేక చొరవతో కలక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెదురు ఉత్పత్తుల స్టాల్‌ను గవర్నర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్పత్తుల తయారీలో ఎదుర్కొంటున్న సమస్యలను, కావాల్సిన సదుపాయాలను క్లస్టర్ చైర్మన్ ఈసం నాగభూషణం, డైరెక్టర్, దిశ కమిటీ సభ్యుడైన బొర్రా సురేష్ గవర్నర్‌కు విన్నవించుకున్నారు. స్పందించిన గవర్నర్ ప్రతిపాదనలతో కూడిన నివేదిక సమర్పించాల్సిందిగా కలెక్టర్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మల్లం కృష్ణయ్య, కారం అనేష్, వర్సా శ్రీను, పద్దం భద్రయ్య పాల్గొన్నారు.

విలీనమైన గ్రామాలను కలపాలి..

బూర్గంపాడు: భద్రాచలం నియోజకవర్గంలోని ఐదు గ్రామ పంచాయతీలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన కారణంగా స్థానికంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపేందుకు చొరవ తీసుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు బీజేపీ నాయకులు విన్నవించారు. ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో రాష్ట్ర గవర్నర్‌ను నాయకులు కలిశారు. కేంద్ర ప్రభుత్వం భద్రాద్రి రామయ్య సన్నిధికి వచ్చే భక్తుల సౌకర్యార్థం పాండురంగాపురం రైల్వేలైన్‌ను భద్రాచలం వరకు విస్తరించేందుకు చర్యలు చేపట్టిందని, ఈ తరుణంలో భద్రాచలం మరింత అభివృద్ధి సాధించాలంటే విలీన గ్రామాలను తప్పనిసరిగా తెలంగాణలో కలిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వాజేడు, వెంకటాపురం మండలాలను భద్రాచలంలో కలపాలన్నారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఏనుగుల వెంకటరెడ్డి, కుంజా ధర్మా, బాలునాయక్, బీరక సాయి శ్రీనివాస్, చక్రవర్తి, బాలాజీ తదితరులున్నారు.



బూర్గంపాడు: గవర్నర్‌తో బీజేపీ నాయకులు

గవర్నర్‌ను కలిసిన ప్రభాకరాచార్యులు

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు కలిశారు. ఈ సందర్భంగా ప్రభాకరాచార్యులతో గవర్నర్ కొద్దిసేపు ముచ్చటించగా, తాను రచించిన వివిధ రకాల పుస్తకాలను గవర్నర్‌కు స్వయంగా అందజేశారు.



అశ్వారావుపేటరూరల్: గవర్నర్‌కు పుస్తకాలను అందజేస్తున్న ప్రభాకరాచార్యులు

రైతులకిచ్చిన హామీలు అమలుచేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

దమ్మపేట: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం అనుబంధ రైతు సంఘం ఏఐకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్ ఎదుట రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ, ఏఐకేఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అబద్ధపు వాగ్దానాలతో రైతులను మోసం చేసిందని విమర్శించారు. హామీలు అమలు చేయని పక్షంలో రైతాంగ పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. నాయకులు అప్పారావు, మోరంపూడి సూర్యనారాయణ, కోలికపోగు శ్రీనివాసరావు, తంగెళ్లమూడి రమేష్, రావుల శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శుక్రవారం విప్పలసింగారం, కూనవరం పంచాయతీల్లో గ్రామస్తుల సమక్షంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ రకాల వినతులు స్వీకరించి అధికారులను చిన్న కారణాలతో నిలిచిపోయిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. గృహలక్ష్మి పథకం, ఉచిత కరెంట్‌తో పాటు రాబోవు రోజుల్లో ఇళ్లు లేని నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, అధికారులు ఎంపీడీఓ తెల్లూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంఈఓ స్వర్ణజ్యోతి, వైద్యాధికారి శివ కుమార్, వ్యవసాయ అధికారులు చటర్జీ, ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి, అధికారులు, నాయకులు గోరంట్ల కనకయ్య, కోటేశ్వరరావు, కూచిపూడి బాబు, రహీం తదితరులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



నివాళులర్పిస్తున్న కూనంనేని, నాయకులు

మణుగూరు టౌన్: అమరుల పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం మండలంలోని రామానుజవరంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య సోదరుడు రామాచారి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి నెల్లూరి నాగేశ్వరరావు, నాయకులు వట్టం నారాయణ, వాసిరెడ్డి చలపతిరావు, పోలెబోయిన శ్రీవాణి, పీరినాకి నవీన్, దొబ్బల వెంకటప్పయ్య, వట్టం రాంబాబు, కుర్రి నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించిన వారిలో పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది



సైకిల్ ర్యాలీలో డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

మణుగూరు టౌన్: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగం వెలకట్టలేనిదని మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా డివిజన్ పోలీసులతో సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు అక్టోబర్ 21 నుంచి కొవ్వొత్తుల ర్యాలీ, ఆన్‌లైన్ ఓపెన్‌హౌస్ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. శనివారం మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, అశ్వాపురం అశోక్‌రెడ్డి, ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు మేడ ప్రసాద్, రాజ్‌కుమార్, తిరుపతి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరేళ్ల నిరీక్షణకు తెర..

- బాధ్యతలు స్వీకరించిన పశు వైద్యాధికారి



బాధ్యతలు స్వీకరిస్తున్న వాసంతి

కరకగూడెం: ఆరేళ్ల నిరీక్షణకు తెరపడింది. ఆరేళ్ల క్రితం మండల పశు వైద్యాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాధాకృష్ణ బదిలీ అవ్వడంతో అప్పటి నుంచి నేటి వరకు ఇన్‌చార్జిల పాలనతో అధికారులు నెట్టుకొచ్చారు. తద్వారా మూగజీవాలకు సకాలంలో వైద్యం అందక పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా కనీసం రైతులకు పాడి పోషణకు సంబంధించిన సలహాలు ఇవ్వడానికి కూడా వైద్యాధికారి లేకపోవడంతో వారి బాధలు అంతా ఇంతా కాదు. ఈ క్రమంలో శుక్రవారం మండల పశు వైద్యాధికారిణిగా జాటోత్ వాసంతి స్థానిక పశువైద్యశాలలో బాధ్యతలు స్వీకరించారు.

ఫలించిన 'సాక్షి' అక్షర పోరాటం..

2016లో కరకగూడెం మండలంగా ఆవిర్భవించగా అప్పటి నుంచి కొంతమంది పశు వైద్యాధికారులు రెండేళ్లు బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత ఇన్‌చార్జ్‌ల పాలన సాగింది. ఈ క్రమంలో 'సాక్షి' పాడి రైతుల సమస్యలను వివిధ కథనాల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లింది. శాశ్వత పరిష్కారం లభించలేదు. తాజాగా పూర్తి స్థాయిలో వైద్యాధికారిణి నియమితమవ్వడంతో పలువురు 'సాక్షి' కి కృతజ్ఞతలు తెలిపారు.



'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు →



జీఎంకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: సింగరేణిలో సుదీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ పొందనున్న సందర్భంగా మణుగూరు ఏరియాకు వచ్చిన జీఎం(సర్వే) జైనులబద్దీన్‌ను ఏరియా జీఎం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో దుర్గం రాంచందర్ ఆధ్వర్యంలో అధికారికి ఆత్మీయ సత్కారం నిర్వహించి ఆయన సేవలను కొనియాడారు. ఏరియా అధికారులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న ప్రకృతివనం



మొక్కలు నరికివేయడంతో వెలవెలబోతున్న పల్లెప్రకృతి వనం

కొద్ది రోజుల క్రితం దాకా ఆకుపచ్చని చెట్లతో ఎంతో ఆహ్లాదకరంగా ఉన్న మండలంలోని నారంవారిగూడెం పల్లెప్రకృతి వనం నేడు వెలవెలబోతోంది. గత ప్రభుత్వ హయాంలో నాటిన మొక్కలు చెట్లుగా పెరిగాయి. కానీ వనంలో పలు రకాల మొక్కలతోపాటు కోనోకార్పస్ మొక్కల్ని కూడా నాటగా, ఈ మొక్కలు హానికరంగా మారడంతో కొద్ది రోజుల క్రితం పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో కోనోకార్పస్ మొక్కల్ని పూర్తిగా నరికివేసి తొలగించారు. మొక్కల్ని నరికివేయడంతో పల్లెప్రకృతి వనం తాజాగా బీడు భూమిగా మారి వెలవెలబోతుంది.

– అశ్వారావుపేటరూరల్